

జెఆర్ పురం బంద్ సంపూర్ణం

విశాలాంధ్ర - రణస్థలం: మండల కేంద్రం జెఆర్ పురంలో 16 నెంబర్ జాతీయ రహదారిపై తలపెట్టిన ఫ్లైఓవర్ పనులను వ్యాపారులు, ప్రజలతో చర్చించకుండా సర్వేలు చేయడాన్ని నిరసిస్తూ గురువారం చేపట్టిన పట్టణ బంద్ సంపూర్ణంగా విజయవంతమైంది. అన్ని వర్గాల వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి బంద్‌లో పాల్గొన్నారు. అదేవిధంగా పబ్లిక్, ప్రైవేట్ బ్యాంకులు, వివిధ సంస్థలు స్వచ్ఛందంగా మూసివేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా హైవేపై ర్యాలీగా వెళ్లి రణస్థలం తహశీల్దార్ నందిగాం ప్రసాదరావుకు వినతి పత్రం అందజేశారు. ఇదే విషయంపై హైవే అధికారులతో మాట్లాడటం జరిగిందని, త్వరలో సమావేశం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తహశీల్దార్ తెలిపారు. పోలీస్ వారి సూచనలు ప్రకారం భవిష్యత్ కార్యక్రమాలు చేసుకోవాలని జె ఆర్ పురం ఎస్ఐ చిరంజీవి కోరారు.

నేడు బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం రాక

విశాలాంధ్ర - కొత్తూరు: భారతీయ జనతా పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన సిరిపురం తేజేశ్వరరావు పాతపట్నం నియోజకవర్గానికి శుక్రవారం రానున్నారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆయన పాతపట్నం నియోజకవర్గానికి రానున్నారు. తొలుత శ్రీ నీలమణి దుర్గా అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకుంటారు. అనంతరం శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి ఆలయం నుంచి సరాలి రోడ్డు సమీపంలోని సిరిపురం క్యాంపు కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహిస్తారు. పాతపట్నం బస్టాండ్ వద్ద ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గం ప్రజలు, భారతీయ జనతా పార్టీ నాయకులు, ఎన్‌డీఏలోని మిత్ర పక్షాలైన తెదేపా, జనసేన పార్టీల శ్రేణులు, నాయకులు, బీజేపీ జిల్లా నాయకులు కార్యవర్గ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని నేతలు కోరారు.

జెబిటి పాఠశాల ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి

విశాలాంధ్ర - జలుమూరు: గాంధీజీ 77వ వర్ధంతి సందర్భంగా సారవకోట మండలం అవలింగి జేబిటి పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం గాంధీజీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పాఠశాల వ్యవస్థాపకులు జోగు మహంతి మోహన్ పూలమాల లువేసి నివాళు లర్పించారు. అనంతరం గాంధీజీ ఆశయాలు పలు అంశాలను మోహన్ గాంధీ వివరించారు. వివిధ రకాల పుష్పాలతో జండా రంగులతో అక్షర రూపం ఏర్పాటు చేసినట్లు పాఠశాల వ్యవస్థాపకులు మోహన్ గాంధీ తెలిపారు. రంగురంగులతో ఏర్పాటు చేసిన ఈ చిత్రాన్ని పలువురు తిలకించారు.

కదలలేని స్థితిలో ఉన్న వారికి నేరుగా జీవిత ధ్రువీకరణ

విశాలాంధ్ర - పొందూరు: అస్వస్థతతో కదలలేని స్థితిలో ఉన్న విశ్రాంత ఉద్యోగులకు, కుటుంబ పింఛనుదారులకు స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నేరుగా జీవిత ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నారు. పొందూరు, వాండ్రంగి, లోలుగు తదితర గ్రామాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఇంతవరకు 40 మందికి వీటిని అందజేశారు. ఫిబ్రవరి చివరి వారం వరకు ఈ కార్యక్రమం సాగుతుందని విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సూర్యప్రకాశరావు, వాండ్రంగి దామోదరరావు, వడగా సూర్యారావు, పాలవలస దివాకర్ పాత్రో తెలిపారు. వివరాలకు పి.సూర్యం సెల్ 94412 49793ని సంప్రదించాలని జిల్లా శాఖ ప్రధాన శాఖ అధ్యక్షులు నాళం పైడిరాజు కోరారు.

ఫిబ్రవరి 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక

- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర పరిధిలోని విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 27వ తేదీ ఉదయం 08.00 నుంచి సాయంత్రం 04.00 గంటల వరకు జరగనుందని, దీనికి సంబంధించిన అన్ని రకాల ప్రక్రియలను జిల్లా అధికార యంత్రాంగం మొదలు పెట్టిందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం వెలువరించిన షెడ్యూల్ ప్రకారం జనవరి 29వ తేదీ నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని అన్నారు. 24 గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పబ్లిక్ ప్రాంతాల్లో రాజకీయపరమైన పోస్టర్లు, ఫోటోలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

ఫిబ్రవరి 03 నుంచి నామినేషన్ల ప్రక్రియ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం వెలువరించిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 03వ తేదీన నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఆ రోజు నుంచి అన్ని ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 11.00 నుంచి సాయంత్రం 03.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారని కలెక్టర్ అన్నారు. 10వ తేదీ సాయంత్రం 03.00 గంటలతో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుందని, 11న పరిశీలన, 13న ఉపసంహరణ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. 27వ తేదీ ఉయం 08.00 నుంచి సాయంత్రం 04.00 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మార్చి 03వ తేదీన కౌంటింగ్ ప్రారంభమవుతుందని, 08వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని కలెక్టర్ వివరించారు. జనరల్ అభ్యర్థులు రూ.10,000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5,000 ధరావతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫారం-26 ద్వారా అఫడవిట్ సమర్పించాలన్నారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే ఇప్పుడు కూడా అన్ని రకాల నిబంధనలు అభ్యర్థులకు వర్తిస్తాయని స్పష్టం చేశారు.

ఓటర్లు 4829, 31 పోలింగ్ కేంద్రాలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లా పరిధిలో 4829 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 3275, కాగా మహిళా ఓటర్లు 1554 మంది ఉన్నారని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు నామినేషన్ ప్రక్రియ ముగియడానికి పది రోజుల ముందు వరకు అనగా జనవరి 31వ తేదీ సాయంత్రం 03.00 గంటల వరకు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

ప్రవర్తనా నియమావళి అమలు పర్యవేక్షణకు 30 బృందాలు

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు చర్యలు తీసుకున్నామని, దానిలో భాగంగా ఎంపీడీవో, వీడియో గ్రాఫర్ తో కూడిన 30 ఎంసీసీ బృందాలను మండలానికి ఒకటి చొప్పున నియమించామని కలెక్టర్ చెప్పారు. అలాగే మండలానికి ఒకటి చొప్పున తహసిల్దార్, ఎస్ఐ, వీడియో గ్రాఫర్‌తో 30 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

మానవ జాతికి గాంధీయే మార్గం

విశాలాంధ్ర - పోలాకి: మానవజాతికి జాతిపిత గాంధీయే మార్గమని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. గురువారం మండల కార్యాలయం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ బాటలో మానవజాతి శాంతిని తీర్చి దిద్దేందుకు ఎంతో స్ఫూర్తినిచ్చారని అన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పద్మావతి, సూపరింటెండెంట్ సూర్య ప్రకాష్, ఏపీఓ రమణారావు, నాయుడు రామకృష్ణ, ఎంపీడీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై మంత్రి ఆరా

- సమగ్ర విచారణకు ఆదేశం

విశాలాంధ్ర - టెక్కలి: జిల్లా ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పసికందు తొడలో సూది ఉండి పోయిన ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విచారణకు ఆదేశించారు. విధి నిర్వహణలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించకుండా నిర్లక్ష్యంపై ఆసుపత్రి పర్యవేక్షకులను ప్రశ్నించారు. ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని మంత్రి వైద్యాధికారులకు ఆదేశించారు.

గోకార్టింగ్ ఛాంపియన్ షిప్‌లో ఐతమ్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - టెక్కలి: ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు భీమవరం ఎస్ఆర్కెఆర్ కళాశాల ఆవరణలో ఈనెల 22 నుండి 26 వరకు నిర్వహించిన గోకార్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలో ఐతమ్ విద్యార్థులు 30 మంది పాల్గొని అత్యంత ప్రతిభకనపరచి మొదటి స్థానాన్ని కైవశం చేసుకున్నారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి.నాగేశ్వ రరావు గురువారం తెలిపారు. ఈ గోకార్టింగ్ పోటీలో వివిద ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 11 బృందాలు పాల్గొనగా ఐతమ్ గోకార్ట్ స్పార్టన్స్ పేరుతో పాల్గొని కాస్ట్ ప్లాన్ ప్రెజంటేషన్ అనే అంశంపై మొదటి బహుమతి సాధించిదని డైరెక్టర్ తెలిపారు. మెకానికల్-21, సిఎసీఈ -3, సిఎస్ఎం-4, ఈసిఈ -2, ఐటీ-1 చొప్పున ఐతమ్ విద్యార్థులు గోకార్ట్ పోటీలో పాల్గొన్నారని ఆయన వివరించారు. ఐతమ్ స్పార్టన్స్ గోకార్టుకు మెంటార్లుగా సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.రఘువీర్, గోకార్ట్ క్లబ్ మెంటారు ఎం. వంశీ నారాయణ్ లు వ్యవహరించారన్నారు. గోకార్టింగ్ బృంద విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐఐసి కన్వీనర్ డాక్టర్ జి.సతీష్ కుమార్, హెచ్‌డీలు డాక్టర్ పి.శ్రీహరి, డాక్టర్ వై.రమేష్, డాక్టర్ ఎం.వి.వి.చంద్రశేఖర్, డాక్టర్ పి.రమేష్ నాయుడు, అధ్యాపక, అధ్యాపకతేర సిబ్బంది అభినందించారు.

మూడు రోజులపాటు టూరిజం బస్సు సౌకర్యం

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: అరసవల్లి రథ సప్తమి వేడుకల్లో భాగంగా ఫిబ్రవరి 2,3,4 తేదీల్లో ప్యాకేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. టూరిజం శాఖ ఆధ్వ ర్యంలో మినీ బస్సు ఏర్పాటు చేసి శ్రీకూర్మం, మొగదలపాడు, సాలిహుండం, శ్రీముఖలింగం, రావివలసకు తిప్పి తిరిగి స్టార్టింగ్ పాయింట్‌కు చేరుకుంటుందని, ఒక్కరికీ రూ.750 చొప్పున టికెట్ ధర ఉంటుం దని, వివరాలకు 84 97949494, 98488 13586లు సంప్రదించాలన్నారు.

ప్రశ్నాపత్రాలను చేర్చడంలో అధికారులు విఫలం

- ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ

విశాలాంధ్ర - ఆమదాలవలస: సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షా ప్రశ్నా పత్రాలని స్కూల్ పాయింట్ వద్దకు చేర్చాలని నిబంధనలు స్పష్టంగా చెబుతున్నప్పటికీ జిల్లాలోని విద్యా శాఖా అధికారులు ప్రశ్నాపత్రాలను నేరుగా పాఠశాలలకు చేర్చకుండా ఉపాధ్యాయులనే తీసుకువెళ్ళమనడం సరికాదని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ తప్పుపట్టారు. ఆమదాలవలస పట్టణంలో ఏర్పాటు చేసిన ఎస్టీయు సేవా కేంద్ర ప్రారంభానికి వచ్చి ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఉదయానికే ఇలా ఆత్రుతగా ప్రశ్నాపత్రాల కోసం వెళ్లి ప్రమాదాలకు గురైన సందర్భాలు కూడా లేకపోలేదని అయినా ఎంసెట్, నీట్, జేఈఈ ఎంట్రెన్స్ వంటి పరీక్షలను మించి ఫార్మేటివ్, సెల్ఫ్ అసెస్మెంట్ ప్రశ్నపత్రాలు విషయంలో ఎక్కడలేని నానా హడావిడి చేస్తున్నారన్నారు. అసలు జిల్లా కేంద్రంగా ఉన్నటువంటి డిస్ట్రిక్ట్ కామన్ ఎంట్రన్స్ బోర్డులో తయారు చేయకుండా డీసీఈబీలను వినియోగించకుండా వాటిని నిర్వీర్యం చేస్తూ ప్రశ్నాపత్రాలు అన్నింటినీ ఎక్కడో ఒక ప్రైవేట్ పబ్లిషర్ చేత ముద్రించడం ఎవరికి లబ్ధి చేకూర్చడానికని ప్రశ్నించారు. అక్కడక్కడ ఒకటో రెండో వెలుగు చూస్తున్న టువంటి రోల్ తేడాను భోగస్ రోల్‌గా పేర్కొని భూతద్దంలో చూడవలిసిన పని లేదని గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పిల్లల తల్లిదండ్రులు దూర ప్రాంతాల్లో ఉన్నప్పుడు కొన్ని సందర్భాల్లో నెలలు తరబడి ఆయా పనులు చేసే ప్రదేశానికి వెళ్లడం తిరిగి రావడం సాధారణంగా జరుగుతూ ఉంటుందని అలాగే కుటుంబ తగాదాల కారణంగా కూడా పిల్లలు పాఠశాలకు దూరమై మళ్ళీ నెల రెండు నెలల తర్వాత తర్వాత తిరిగి రావడం అనేది సాధారణంగా జరుగుతుందని అయితే దీనికి వేరే శాఖ అధికారులు వచ్చి యూడైస్ పూరిఫికేషన్ చేసేవరకు విద్యాశాఖా అధికారులు ఏమి చేస్తున్నారని వారిని ప్రశ్నించారు. అప్పటికీ వాస్తవంగా భోగస్ రోల్ ఉన్నట్లయితే నిబంధనల ప్రకారం నడుచుకోవాలని అధికారులకు హితువు పలికారు. ఒక ప్రక్క విద్యాశాఖ మంత్రి పాఠశాలల మ్యాపింగ్ విషయంలో క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు తీసుకుని అందరికీ ఆమోదయోగ్యమైన పరి ష్కారం చూడమని చెబుతుంటే అధికారులు ఉపాధ్యాయ సంఘ నాయకులు అభిప్రాయం గాని తల్లిదండ్రులు కమిటీ తీర్మానాన్ని పరిగణలోకి తీసుకోకుండానే ఏకపక్షంగా ముందుకు వెళ్లడం తగదన్నారు. సమావేశంలో పి.రామకృష్ణ, బి.రమేష్ కుమార్, పి.అన్నాజీ బాబు, ఎ.గోపి, బి.మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ సమావేశం వాయిదా

విశాలాంధ్ర - పలాస: శాసనమండలి ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్న కారణంగా గురువారం జరగవలసిన పలాస కాశీబుగ్గ మున్సిపల్ బడ్జెట్ సమావేశం వాయిదా పడింది. చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం కోడ్ అమలులో ఉన్న కారణంగా బడ్జెట్ సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. 2025-2026 సంవత్సరంనకు గాను బడ్జెట్ సమావేశం జరగాల్సి ఉంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో బడ్జెట్ సమావేశం వాయిదా పడింది.

నియోజకవర్గ వైసీపీ యూత్ అధ్యక్షుడుగా నరేష్

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గం వైసీపీ స్టూడెంట్స్ విభాగం అధ్యక్షుడిగా నక్కిట్ల నరేష్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ నుంచి లేఖ అందినట్లు నరేష్ తెలిపారు. నరేష్ పార్టీలో అందించిన సేవలను గుర్తించి టెక్కలి నియోజకవర్గం ఇన్‌చార్జ్ పేడాడ తిలక్ సిఫారసు మేరకు నియమించినట్లు తెలిపారు. నియోజకవర్గ బాధ్యులుగా నియమించి, తనపై పార్టీ అధిష్టానం ఉంచిన నమ్మకాన్ని, పార్టీ అభివృద్ధికి, ఐకమత్యానికి కృషి చేస్తానని నరేష్ తెలిపారు.

సూపర్ సిక్స్ హామీలు గాలికి: మాజీ ఎమ్మెల్యే శాంతి

విశాలాంధ్ర - హిరమండలం/పాతపట్నం: ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలు సీఎం చంద్రబాబు నాయుడు గాలికొదిలేశారని పాతపట్నం నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు రెడ్డి శాంతి దుయ్యబట్టారు. గురువారం పాతపట్నంలోని వైసీపీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని నేరవేర్చి మాట నిలబెట్టుకోవాలన్నారు. 50 ఏళ్ళకే బీసీలకు వృద్ధాప్య పింఛన్లు, 18ఏళు నిండిన ప్రతీ మహిళకు నెలకు రూ.1500లు, అమ్మకు వందనం రూ.15వేలు, రైతుకు రూ.20 వేలు, వంటగ్యాస్ సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్‌లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇవేవీ అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. అక్కచెల్లెమ్మలకు, ఒంటరి మహిళలకు, రైతులకు, విద్యార్థులకు ఫీజురీయంబర్స్‌మెంట్, అమ్మఒడి తదితర వాటిని ఆపకుండా అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి అందవరం వెంకట్ సురేష్, హిరమండలం మండల వైసీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ, వైస్ ఎంపీపీ ప్రతినిధి వంగపల్ల చిన్నరావు, రెడ్డి రామారావు, ఎంపీపీ రెడ్డి జ్యోతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని ఆశయాలను అనుసరిద్దాం

విశాలాంధ్ర - ఆమదాలవలస: మహాత్మా గాంధీ భారతదేశానికి చేసిన సేవలు మరువ లేనివని ఆయన శాంతియుత మార్గాన్ని ఆశయాలను అందరం అనుసరించాలని మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆమదాలవలస పట్టణంలో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మ గాంధీ స్ఫూర్తి వల్లనే ఆయన ఆశయాల వల్లనే నాడు మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి లఖినేని నారాయణరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బస్వా షణ్ముఖరావు, సనపల రాజులు, బొత్స రమణ, లఖినేని సాయిరాం, అప్పారావు, దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గత ఐదేళ్ళలో రూ.10లక్షల కోట్లు అప్పు చేసిన జగన్

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట: గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సుమారు రూ.10లక్షల కోట్లు అప్పు చేశారని, గడచిన 7 నెలల్లో ఆరోగ్య శ్రీ, ఫీజు రీయంబర్స్ మెంట్, ధాన్యం బకాయిలు కలిపి, సుమారు రూ.22వేల కోట్లు అప్పు రాష్ట్ర ముఖ్య మంత్రి, చంద్ర బాబు నాయుడు చెల్లిం చారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రానికి అప్పులు పుట్టని స్థితి నేడు ఏర్పడిందని, ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లిం చాలని, ఈ పరిస్థితి సి.ఎం చంద్ర బాబుకు గుది బండగా మారిందని అన్నారు. ఇలా జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయిలు రూ.1.40 కోట్లు ఉన్నాయని, ఈ స్థాయిలో గత ఏ ప్రభుత్వం బకాయిలు పెట్టలేదని తెలిపారు. తెచ్చిన అప్పులు ప్రభుత్వ ఆదాయం పెంచే సాగునీటి ప్రోజెక్టులు, అమరావతి నిర్మాణం లాంటి వాటిపై కాకుండా జగన్ విలాసాలు, జల్సాలకు ప్రభుత్వ ధనం రూ.19,871. 35కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. అలాగే ఐదేళ్ళలో అధికారాన్ని అడ్డు పెట్టుకొని జగన్‌మోహన్ రెడ్డి

కుటుంబం రూ.8లక్షల కోట్లు లూటీ చేసిందని, భూ కేటాయింపులు, గనుల త్రవ్వకాలు, సోలార్‌కు అనుమతులు ఇలా ప్రతీ రంగంలో అశ్రిత పక్షపాతానికి ఒడిగట్టి లక్షల కోట్లు సంపాదించారని దుయ్య బట్టారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచా యితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, 20వ వార్డ్ మెంబర్, బతకల సంతోషి, సోషల్ మీడియా కన్వీనర్, బగ్గు అర్చన, టిడిపి నాయకులు, శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, బోయిన సతీష్, కత్తిరి వెంకటరమణ, అడపా చంద్రశేఖర్, వారణాశి రమేష్, గొలివి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ జీవితమే ఒక సందేశం

వీసీ కేఆర్ రజని

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: గాంధీజీ జీవితమే ఓ సందేశమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా వర్సిటీలో గురువారం మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్యం, ధర్మం, అహింస ఆయుధాలుగా మహాత్ముడు స్వరాజ్య పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఎస్వి డాక్టర్ కె. సామ్రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ ఎం. అనూరాధ, డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలను అవలంబించాలి

విశాలాంధ్ర - కవిటి: గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్క విద్యార్థి అవలంబించాలని ఉపాధ్యాయుడు సంతోష్ విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కవిటి శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణంలో గాంధీజీ చిత్రపటానికి ఉపాధ్యాయ సిబ్బందితోపాటు పలువురు విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని పి వై జి పుట్టుగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం దేవదాసు ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి హెచ్ఎం దేవదాస్, విద్యార్థులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, ఎస్ఎంసి చైర్మన్ చంప, వైస్ చైర్మన్ ఖిరోమని తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల అన్నసంతర్పణ

విశాలాంధ్ర - సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గం జనసేనపార్టీ ఇన్‌చార్జ్ దాసరి రాజు ఆధ్వర్యంలో గురువారం సీతయ్య ఫౌండేషన్‌లో వృద్ధులు, అనాథలు, బాలలకు అన్న సంతర్పణ చేపట్టారు. ఎచ్చెర్ల నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ కాంతిశ్రీ ఇటీవల మృతి చెందడంతో సంతాపంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు బీన ప్రదీప్, చందు, సంతోష్, శీలం బాలు, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి ఉత్సవాలకు దానేటి సైతం

- కమిషనర్‌కు రూ.50 వేల చెక్కు అందజేత

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: ఆరోగ్య ప్రదాత, ప్రత్యక్ష దైవం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి రథసప్తమి ఉత్సవాలకు జనసేన నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ నేను సైతం అంటూ ముందుకు కదలారు. ఈ సందర్భంగా డాక్టర్ దానేటి శ్రీధర్ చాంబర్‌లో కార్పొరేషన్ ఆర్ఐ ఉమామహేశ్వరరావుకు రూ.50వేల చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ రథసప్తమి ఉత్సవాలను రాష్ట్ర పండుగ నిర్వహించడం అభినందించదగ్గ విషయం అన్నారు. ఉత్సవాల నిర్వహణ కోసం నగర సుందరీకరణకు శ్రీకారం దిద్దిన కేంద్ర రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే గొండు శంకర్ ల అభినందనలు తెలిపారు. ఈ ఏడాది నిర్వహించే రథసప్తమి వేడుకలు సిక్కోలు ఆధ్యాత్మిక చరిత్రలో కలికితురాయిగా నిలిచిపోతుందని ఆకాంక్షించారు. శోభాయాత్ర, క్రీడా పోటీలు, లేజర్ షో, పలు సంస్కృత కార్యక్రమాలతో భక్తులకు ఉల్లాసాన్ని కలిగించేలా కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు రచించిన జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

విశాఖలో కేంద్ర మంత్రులకు స్వాగతం పలికిన ఎంపీ కలిశెట్టి

విశాలాంధ్ర - రణస్థలం: విశాలాంధ్ర ఇటీవల కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు సుమారు రూ.11,440 కోట్ల ప్రత్యేక భారీ ప్యాకేజీను ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే గురువారం కేంద్ర ఉక్కు మంత్రులు ఇద్దరు విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం తీసుకునే తదుపరి చర్యలు గురించి, అలాగే ప్లాంట్‌కు కేటాయించిన నిధులను ఎలా సద్వినియోగం చేయాలి, ఎలా సర్దుబాటు చేయాలనే అంశంపై స్టీల్‌ప్లాంట్ పరిశీలనకు విశాఖ వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామికి, సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మలకు విశాఖ ఎయిర్‌పోర్టులో రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్‌తోపాటు, విశాఖ పట్నం ఎంపీ శ్రీ భరత్, అనకాపల్లి ఎంపీ, రైల్వే కమిటీ చైర్మన్ సీఎం రమేష్‌తో కలిసి వారి ఇరువురికి విజయనగరం పార్లమెంట్ సభ్యులు, ఐటీ /కమ్యూనికేషన్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్ ఉన్నారు.

ఇంటర్ విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

విశాలాంధ్ర - సోంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతూ గత ఏడాది పబ్లిక్ పరీక్షల్లో మంచి ప్రతిభ సాధించిన పొందర అనూష పాత్రోకు బేటీ బచావో, బేటీ పడావో పథకం కింద జిల్లా కలెక్టర్, డీఈఓల చేతలు మీదుగా శ్రీకాకుళంలో నగదు ప్రోత్సాహకంతో పాటు మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.మోహనరావు, ఎబిఎస్ఓ రజనీకుమారి, ఎన్ఎస్ఎస్ పీఓలు రామినాయుడు, ప్రసాద్, అధ్యాపక సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. అనూష పాత్రోను ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థిని మంచి ప్రతిభ సాధించి ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి

విశాలాంధ్ర - పలాస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి చేస్తుందని, అందులో భాగంగా డివిజన్ పరిధిలో విభిన్న ప్రతిభావంతులు నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ డైరెక్టర్ కొల్లి కవిత అన్నారు. గురువారం పలాస మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపిడిఓ కె వసంత కుమార్ ఆధ్వర్యంలో

ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారంతో విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా ఉపకరణాలను పంపిణీ చేసేందుకు అర్హత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సుమారు రూ.50 లక్షలు సిఎస్ఆర్ కింద ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఖర్చు చేస్తోందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సమానంగా అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కూడిన ఆప్టిమైజ్డ్ వర్క్‌లు, అత్యంత నైపుణ్యం కలిగిన వర్క్‌ఫోర్స్ తయారీ సౌకర్యాలతో అధిక నాణ్యత గల పరికరాలను అందించడానికి అర్హులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ వసంత కుమార్, మండల పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంఠ రావు, పంచాయితీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించే వరకు పోరాడుతాం

విశాలాంధ్ర-కవిటి: బెంతొరియాల కులధ్రువీకరణ పత్రాల సమస్య పరిష్కారం అయ్యే వరకు మా పోరాటం ఆగదని ఆ సంఘ నాయకులు తెలిపారు. కవిటిలో బెంతొరియాలు చేస్తున్న దీక్షలు గురువారంకు 400 రోజులు పూర్తి అయ్యాయి. గురువారం తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన బెంతొరియాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులధ్రువీకరణ పత్రాలు లేక విద్యార్థులు ఉన్నత చదువులకు, యువకులు ఉద్యోగాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మా సమస్యను పరిష్కరించాలని కోరారు.

విశాలాంధ్ర
పేజీ : 2
శ్రీకాకుళం
శుక్రవారం 31, జనవరి 2025

వివిధ పదవులు కోసం తెలుగు తమ్ముళ్లు ఎదురుచూపులు

విశాలాంధ్ర-జలుమూరు : గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీలు సహకార సంఘ దేవస్థాన కమిటీ చైర్మన్లు పాలకవర్గ సభ్యుల పదవుల కోసం తెలుగు తమ్ముళ్లు ఎదురుచూస్తున్నారు. నరసన్నపేట నియోజకవర్గం జలుమూరు, సారవకోట మండలాల్లో ఒక ఏఎంసి, చల్లవానిపేట, అల్లాడ, బుడితి, సారవకోట సహకార సంఘాలకు నామినేటెడ్ పదవుల కోసం తెలుగు తమ్ముళ్లు ఎదురుచూస్తున్నారు. ఎంతమంది అభిమానులు ఉన్నప్పటికీ పార్టీ అభివృద్ధి కోసం పాటుపడిన వ్యక్తులు అభిమానుల కోసం పార్టీ నేతలు యోచిస్తున్నారు. ఎవరిని ఏ పదవులు కట్టబెట్టాలన్న అంశంపై స్థానిక శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి పూర్తి సమాచారంతో ఉన్నట్లు తెలుస్తుంది.

ఫిబ్రవరి 7లోగా తెలంగాణా సిఎం వర్గీకరణపై స్పష్టమైన ప్రకటన చేయాలి

ఎంఆర్పిఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నింగి నాగరాజు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఫిబ్రవరి 7వ తేదీలోగా తెలంగాణా ముఖ్యమంత్రి ఎస్సీ వర్గీకరణ పై స్పష్టమైన ప్రకటన చేయాలని ఎంఆర్పిఎస్ జాతీయ అధ్యక్షులు మున్నింగి నాగరాజు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలుకై లక్ష డప్పులు వేలగొంతులు భారీ సాంస్కృతిక ఆయుధ ప్రదర్శన వచ్చే నెల 7వ తేదీన ఛలో హైదరాబాద్ కార్యక్రమంపై గురువారం ఎన్జీఓ హోంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో సాంస్కృతిక ఉద్యమాన్ని మాదిగ జాతి నిర్వహించ తలపెట్టిన షెడ్యూల్ కులాల వర్గీకరణకు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు పెద్ద ఎత్తున మాదిగలంతా లక్షల డప్పులు వేలగొంతులు వినిపించేలా వచ్చే నెల 7వ తేదీన ఛలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాదిగ జాతి కళా సాంస్కృతిక డప్పును ప్రపంచానికి పరిచయం చేసేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ రాష్ట్రాలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు చెప్పగానే ప్రస్తుత తెలంగాణా ప్రభుత్వం శాసనసభ సాక్షిగా తెలంగాణా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలను గౌరవించి ఎస్సీ ఉప కులాల వర్గీకరణకు చర్యలు చేపడతామని శాసన సభలో ప్రకటించినట్లు ఆయన చెప్పారు. వర్గీకరణ అనివార్య కారణాల వలన ఆలస్యమైతే ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువచ్చి మాదిగ కులాలు విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ రంగాల్లో లబ్దిపొందేలా చేస్తామన్నట్లు పేర్కొన్నారు. శాసన సభా సాక్షిగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని

జాతీయ అధ్యక్షులు మున్నింగి నాగరాజు తెలంగాణా ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 7వ తేదీన తలపెట్టిన లక్ష డప్పులు వేలగొంతులు ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి మాదిగ జాతి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లోపింటి తేజేశ్వరరావు, ఉత్తరాంధ్ర ఎమ్మార్పీఎస్ ఇన్చార్జ్ రానా శ్రీనివాసరావు, ఎంఎస్పి అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు దాసరి తిరుమలరావు, మన్యం జిల్లా ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ బోస్ మన్మధరావు, ఎందవ నారాయణరావు, లోపింటి కృష్ణ, కంటిపాక హేమ శేఖర్, దీర్ఘాసి హరి, కాసుకుర్తి గోవింద, కురమాస భారతి, కంటిపాక రాధాకృష్ణ, నవిరి రాజు, ఎందవ రవి, గొంటిపాలయ్య, తదితర మాదిగలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు చోరీ.. ముఠా అరెస్ట్...

ఏడు వాహనాలు స్వాధీనం

విశాలాంధ్ర -టెక్కలి: ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన ముఠా సభ్యులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ అంబటి విజయ్ కుమార్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. పోలీస్ స్టేషన్లో అదుపులోకి తీసుకున్న నిందితులను మీడియా ముందు హాజరపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టెక్కలి మండల పరిధిలోని డిసెంబర్ 26, 27న రెండు ద్విచక్ర వాహనాలు, జనవరి 10, 11, తేదీలలో 3 ద్విచక్ర వాహనాలతో మొత్తం ఐదు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయని, డిసెంబర్ 5వ తేదీన రాయగడ జిల్లా మునిగూడా పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ద్విచక్ర వాహనం, మన్యం జిల్లా పార్వతీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు సుమారుగా ఏడు ద్విచక్ర వాహనాలు ఒరిస్సా కి సంబంధించిన ముఠా దొంగతనం చేయడం జరిగిందని తెలిపారు. ఒరిస్సాకి సంబంధించిన నలుగురు వ్యక్తులకు టెక్కలికి సంబంధించిన పడాల అఖిల్ అనే యువకుడు స్నేహ పరంగా సహాయం అందించడంతో వీరు అయిదుగురు కలిసి 7 ద్విచక్ర వాహనాలు దొంగిలించినట్లు తెలిపారు. టెక్కలి పరిధిలో అధిక మొత్తంలో వాహనాలు దొంగతనాలు జరగడంతో జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, డిఎస్పి మూర్తి ఆదేశాల మేరకు ఒక ప్రత్యేక క్రైమ్ టీమ్ ని ఏర్పాటు చేసి తరచూ తనిఖీలు నిర్వహించామని అన్నారు. ఈ తనిఖీలలో భాగంగా టెక్కలికి సంబంధించిన వ్యక్తి ద్వారా ఈ దొంగతనాలు జరుగుతున్నాయని విషయం తెలుసుకొని ముందస్తు సమాచారం మేరకు బుధవారం 4:00 గంటల సమయంలో మెలియాపుట్టి రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జ్ వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మెలియాపుట్టి వైపు నుండి ద్విచక్ర వాహనాలపై వస్తున్నటువంటి ఐదుగురు వ్యక్తులను వాహనాలు గుర్తించినట్లు తెలిపారు. వాహనాలు నిలిపివేసి తనిఖీ చేస్తున్న తరుణంలో ఐదుగురు వ్యక్తులలో ఇద్దరు వ్యక్తులు గమనించి వాహనాలను అక్కడ వదిలేసి పారిపోయినట్లు తెలిపారు. మిగిలిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వదిలేసిన రెండు వాహనాలు తో పాటు వీరు ముగ్గురితో ఉన్న మూడు వాహనాలు స్వాధీనం చేసుకొని, దొంగతనాలకు గురైన మిగిలిన రెండు ద్విచక్ర వాహనాలు గురించి నిందితులను ఆరా తీయగా బజాజ్, యమహా ఆర్ 15, బజాజ్ పల్సర్, యమహా ఎంటి15, యమహా ఆర్ఎక్స్ 100, యమహా ఆర్ 15, యమహా మొత్తం7 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని,ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ విజయ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం అదుపులోకి తీసుకున్న వ్యక్తులలో ఒక వ్యక్తి మేజర్ వ్యక్తిని, మరో ఇద్దరు వ్యక్తులు సిఐసిఎల్ (చైల్డ్ ఇన్ కాన్ఫ్లిక్ట్ విత్ లా) మైనర్లుగా గుర్తించామని వెల్లడించారు. మరో ఇద్దరు ఒరిస్సాకి సంబంధించిన వ్యక్తులు పరారయ్యారని త్వరలోనే ఆ ముద్దాయిలను కూడా పట్టుకుంటామని తెలిపారు. ఈ ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదుచేసి రిమాండ్కు తరలిస్తున్నట్లు సిఐ అంబటి విజయ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ రాము, స్పెషల్ క్రైమ్ టీం, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బాపూజీ బాట విశ్వశాంతికి స్ఫూర్తి

విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ప్రపంచానికి సత్యం, అహింస మార్గాలను అందించి పోరాట స్ఫూర్తికి ప్రతిరూపంగా నిలిచిన మహాత్మాగాంధీ చూపిన బాట విశ్వశాంతికి స్ఫూర్తిని అందిస్తుందని విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావు పేర్కొన్నారు. గాంధేయ మార్గం మానవజాతికి ఎప్పుడూ శాంతిని ప్రబోధిస్తూ సంకల్ప శక్తిని అందిస్తుందన్నారు. నగరంలోని శాంతిసగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిర భారత స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తల స్మృతివనం 4వ వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తలను ఒకేచోట కొలువుదీర్చి భావితరాలకు మహనీయుల త్యాగాలను తెలియజేసే ప్రయత్నం ఎంతో గొప్పదన్నారు. బాపూజీ బాటలో మానవజాతి శాంతి కాముకులుగా తీర్చిదిద్దేందుకు భావితరాలు దేశంపట్ల భక్తిని పెంచుకునేందుకు స్మృతివనం ఎంతో స్ఫూర్తిని అందిస్తుందని తెలిపారు. వృత్తిపరంగా ఎన్నో ప్రాంతాలు తిరిగినప్పటికీ శ్రీకాకుళం జిల్లా నేల స్వాతంత్ర్య స్ఫూర్తిని అందిస్తూ మహనీయుల త్యాగాలను సజీవంగా ఉంచిన నిర్వాహక బృందం ప్రయత్నం, దాతల సహకారం అభినందనీయ మన్నారు. తొలుత గాంధీ మందిరం ఆవరణలో 105 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

శాస్త్రోక్తంగా విశ్వశాంతి హెూమం... విశ్వశాంతి కోరుతూ జిల్లాకు చెందిన పోలీసు, సీఆర్పీఎఫ్, ఆర్మీలో పనిచేసి అమరవీరులైన వారి అమరవీరుల స్థూపం గాంధీ మందిరంలో నెలకొల్పిన క్రమంలో అక్కడ శాస్త్రోక్తంగా విశ్వశాంతి హెూమాన్ని నిర్వాహక బృందం ఆధ్వర్యంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, సరోజ దంపతులు

నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావుతోపాటు గాంధీమందిర ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు హెూమం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవధాన పండితులు పైడి హరనాథరావు, నిష్టల నర్సింహమూర్తి, స్వాతంత్ర్య సమరయోధుల కీర్తిని ఆలపించారు. అనంతరం గాంధీ మందిర కమిటీ బృందం విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావును, విశ్వశాంతి హెూమకర్తలు కొంక్యాన వేణుగోపాల్ దంపతులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావును ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు సురంగి మోహనరావు, ఎం.ప్రసాదరావు, జామి భీమశంకర్, బలివాడ మల్లేశ్వరరావు, నిక్కు అప్పన్న, వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, బరాటం లక్ష్మణరావు, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, పొన్నాడ రవికుమార్, బాడాన దేవభూషణ్, నటుకుల మోహన్, కొమ్ము రమణమూర్తి, నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు, పెంకి చైతన్యకుమార్, మహిబుల్లాఖాన్, మెట్ట అనంతంభట్లు, పందిరి అప్పారావు, బుడుమూరు సూర్యారావు, మాజీ సైనికుల సంక్షేమాధి కారి ఈశ్వరరావు, తమ్మినేని ఉషారాణి, బెందాళం వరలక్ష్మి, పద్మావతి, పాండ్రంకి మురళీకృష్ణ, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పట్టణ అధ్యక్షుడు గోపికి సన్మానం

విశాలాంధ్ర-పలాస: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యువ నాయకత్వం సారధ్యంలో పార్టీ మరింత పటిష్టతకు కోసం పనిచేస్తామని పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన యువకులు స్పష్టం చేశారు. మాజీ మంత్రి డా. సీదిరి అప్పలరాజు ఆశీస్సులతో పట్టణ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా శిష్టు గోపి ఇటీవల నియమితులైన సందర్భంగా గురువారం ఆయన్ని కలిసి దుశ్శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ పటిష్టత కోసం డా.సీదిరి అప్పలరాజు నాయకత్వం బలోపేతం కోసం పట్టణ అధ్యక్షులు గోపి ఆధ్వర్యంలో పనిచేస్తామని చెప్పారు. ప్రధానంగా మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిస్కారం కోసం రాజీలేని పోరాటం చేసి ప్రజల అభిమానం పొంది,పార్టీ విజయానికి మరింత

కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి వాసు,బోనెల గణపతి, లండ పాపారావు, నెయ్యల శివకుమార్, నందిగాం ప్రసాద్, తోట సోమేశ్, కొవ్వూరు రాజేష్, కరుమోజు లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-కవిటి: కవిటి, రాజపురం సబ్స్టేషన్ల పరిధిలో 11కేవీ మరామత్తులు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కవిటి,ప్రగడపుట్టుగ, గొండ్యాల పుట్టుగ, రాజపురం, భైరిపురం, నెలవంక, కపాసుకుద్ది, లండారిపుట్టుగ గ్రామాల్లోని ఆర్డబ్ల్యూఎస్, వ్యవసాయ, గృహ కనెక్షన్లకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస విద్యుత్తు శాఖ ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

మాధకద్రవ్యాలపై హడలెత్తించిన జాగిలం

విశాలాంధ్ర-పోలాకి: పోలీసులు అధికారులకు ఆదేశాల మేరకు గురువారం పోలాకి మార్కెట్లో పోలీసులు అడుగడుగునా జాగిలం పరుగులు పెట్టి హడలెత్తించింది. పోలాకి వ్యాపారులు షాపుల్లో ముమ్మరంగా సోదాల్లో గంజాయి మాదకద్రవ్యాలు ఏమి లభ్యం కాకపోవడంతో వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ క్రమంలో పోలాకి పోలీసులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1 నుండి మూడు రోజులు వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు

విశాలాంధ్ర-జలుమూరు : సారవకోట మండలం కిన్నెరవాడ గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 55వ వార్షికోత్సవ కార్యక్రమం ఫిబ్రవరి 1 నుండి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సిద్దయ్య స్వామి తెలిపారు. మొదటి రోజు ప్రత్యేక పూజలు, రెండో రోజు జిల్లా నలుమూల నుండి ఆశ్రమ స్వామీజీలతో సత్సంగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మూడవరోజు కూడా ఇదే కార్యక్రమం ఉంటుందని, ఆధ్యాత్మిక చింతన వైపు ప్రతిఒక్కరూ ప్రయాణం చేయాలని సత్సంగత్య కార్యక్రమంలోపాల్గొవాలని సిద్దయ్య స్వామి కోరారు. మూడు రోజులు భక్తుల ఆనందం కోసం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జనసేన కార్యాలయంలో ఘనంగా జాతిపిత వర్ధంతి

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలో స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి ని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ కణితి కిరణ్ అధ్యర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కణితి కిరణ్ మాట్లాడుతూ గాంధీ త్యాగం, అహింస, సత్యం,

ధర్మ మార్గాల్లో ఉద్యమించాలని వారు ఇచ్చిన స్ఫూర్తి తరతరాలకి భారతీయులకు తరగని ఆస్తి అని కొనియాడారు. ప్రస్తుత కాలంలో పరిశుభ్రత, స్వదేశీ, స్వీయభాష అనే పూజ్య బాపూజీ ఆలోచనలను స్వీకరించడం, అనుసరించడం గాంధీజీకి నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ నాయకులు కుమారస్వామి, గవరయ్య, త్రివేణీ రావు, గిరి, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

విశాలాంధ్ర-పలాస: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పలాస ఆర్ డబ్ల్యూఎస్ డిఇ సూర్యనారాయణ అన్నారు. గురువారం పలాస ఆర్ డబ్ల్యూఎస్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు ప్రతీ నెల మూడో శనివారం స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలు పరిశుభ్రత కోసం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయం ఆవరణలో ఆహ్లాద కరమైన వాతావరణం ఏర్పాటు కోసం పిచ్చి మొక్కలను తొలగించి వాటి స్థానంలో పూల, మారేడు, జువ్వి, నేరేడు తదితర మొక్కలను నాటడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూఎస్ ఎఇలు ప్రసన్న కుమార్, సతీష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఛాంపియన్లుగా కేజీబీవీ విద్యార్థినులు

విశాలాంధ్ర-హిరమండలం : భేటీ బచావో.. భేటీ పడావో ఛాంపియన్స్ ప్రొగ్రాంలో భాగంగా 2023-24 విద్యా సంత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో శ్రీకాకుళం జిల్లాలో ప్రధమ స్థానంలో నిలిచిన హిరమండలం కేజీబీవీ విద్యార్థిని వంజరాపు శ్రావ్య 583/600, ఇదే కేజీబీవీ విద్యార్థిని కూర్మాన ఉమాదేవి 572/600 మార్కులు సాధించినందుకుగాను శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్, జిల్లా విద్యా శాఖాధికారి తిరుమల చైతన్య, ఎస్ఎస్ఎ, ఎపిసి డా.శశిభూషణ్ చేతులు మీదుగా విద్యార్థినిలకు క్యాష్ ప్రైజ్, మెమంటోసు బుధవారం శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో భేటీ బచావో ప్రొగ్రాంలో అందజేయడం జరిగిందని కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్ కృష్ణవేణి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిరమండలం కేజీబీవీ విద్యా ర్థినిలు చదువుల ఆణిముత్యాలని కొనియాడారు. ఈకార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయునిలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే దిశ నిర్దేశం చేసుకోవాలి

కరస్పాండెంట్ లోల్ల రాజేష్

విశాలాంధ్ర-కవిటి: ప్రతి విద్యార్థి విద్యార్థి దశలోనే దిశ నిర్దేశం చేసుకోవాలని తద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని శ్రీ కళ్యాణి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ లోల్ల రాజేష్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రమైన కవిటి లోల్ల నారాయణ మూర్తి కళ్యాణ మండపంలో శ్రీకళ్యాణి జూనియర్ కళాశాల విద్యార్థుల ఫేర్వెల్ డే చేపట్టారు. ఈమేరకు శ్రీకళ్యాణి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకరరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరస్పాండెంట్ లోల్ల రాజేష్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి రాజేష్ తండ్రి శ్రీ కళ్యాణి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఫౌండర్ కీర్తిశేషులు లోల్ల నారాయణమూర్తి చిత్రపటంకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్మీడియట్ దశలోనే గోల్ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మన ప్రాంత విద్యార్థులు జేఈఈ,ఐటి లో మంచి ర్యాంకులు సాధించి ఉద్దాన ప్రాంతానికి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులచే సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పండి బిందు మాదవి, శ్రీకళ్యాణి స్కూల్ డైరెక్టర్ బల్లెడ రమేష్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మడ్డువలస, తోటపల్లి, నారాయణపురం కాలువల మరమ్మత్తులకు నిధులు కేటాయించండి

- బుడుమూరు చెరువును మినీ రిజర్వాయర్గా తీర్చిదిద్దండి
- ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే, ఎంపీ

విశాలాంధ్ర-రణస్థలం : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా సచివాలయంలో కలిసి నియోజకవర్గంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల కోసం విన్నవించిన ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్), విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి నియోజకవర్గ రైతులు ఎదుర్కుంటున్న పలు ఇబ్బందులను ముఖ్యమంత్రికి సవివరంగా వివరించారు. బుడుమూరు చెరువును మినీ రిజర్వాయర్ గా తీర్చిదిద్దినట్లయితే మూడు మండలాల ప్రజలకు త్రాగునీరు, సాగునీరు కష్టాలు దూరమవుతాయని ఎమ్మెల్యే ఎన్ఈఆర్ పేర్కొన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

ఆరోగ్యకర పశువులతో లాభసాటి పాడి పరిశ్రమ

జాయింట్ డైరెక్టర్ రాజగోపాలరావు

విశాలాంధ్ర-ఆమదాలవలస: పశువులు ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే అధిక పాల దిగుబడి ద్వారా రైతుకు లాభసాటి గా ఉంటుందని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె రాజగోపాలరావు అన్నారు. గురువారం రామచంద్రపురం లో ఉచిత పశు వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే కొత్తవలస పశు వైద్యాధికారి డాక్టర్ ఓంకార్ ఇంటి వాడలో పశు వైద్య ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి మందులు అందించారు.ఈ శిబిరాలు నందు సాధారణ చికిత్సలు, గర్భకోశవ్యాధి చికిత్సలు, కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు, పేడ మరియు రక్త పరీక్షలు, దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించుట, వివిధ వ్యాధులకు చికిత్సలు,వివిధ పశు వ్యాధుల పట్ల అవగాహన,పశు యాజమాన్యం మరియు లాభసాటి పాడి పరిశ్రమ పై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమా ధానాలు అందించారు.ముఖ్యంగా లాభసాటి పాడి పరిశ్రమ కొరకు ఏకవార్షిక మరియు బహువార్షిక పశుగ్రాసాల సాగుపై అవగాహన కల్పించడమైనది. సీజనల్ వ్యాధులపట్ల అవగాహన మరియు వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యత గూర్చి రైతులకు వివరించారు. గ్రామంలో గొర్రెలు మరియు మేకలు అధిక సంఖ్యలో ఉన్నందున పెంపకం దారులకు వివిధ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ శిబిరం లో గొర్రెలకు మరియు మేకలకు మశూచి వ్యాధి నివారణ టీకాలు వేశారు. డా.వై.హేమలత, డా.బి.ఓగేశ్వర రావు,సాంధ్ర గొర్రెల అభివృద్ధి సంస్థ లైవ్స్టాక్ అసిస్టెంట్ బి.ఇందిర, జూనియర్ వెటరినరీ ఆఫీసర్స్ డి.ఆదిలక్ష్మి, పి.రంభాయి, ల్యాబ్ టెక్నీషియన్ బి.సుమతి పశువైద్య సహాయకులు జి.నవీన్ పి.ప్రవీణ్ సీ.కళ్యాణి, ఎస్.నారాయణరావు, హాస్పిటల్ అటెండెంట్స్ ఏ.సూర్యారావు, జే.ఉమామహేశ్వర రావు మరియు గోపాలమిత్ర సుధారాణి పాల్గొని ఈ శిబిర ముసు విజయవంత మగుటలో సహకరించారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర-రణస్థలం : మండలంలో కమ్మసిగడాంలో ఫిబ్రవరి 7 నుంచి మూడురోజులు జరిగే శ్రీ మహాలక్ష్మీతల్లి జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. ఈ మేరకు గురువారం జె.ఆర్.పురం సీఐ ఎం. అవతారం, ఎస్ఐ ఎస్. చిరంజీవి జాతర స్థలాన్ని పరిశీలించారు. పార్కింగ్ స్థలం, తదితర విషయాలు కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్య క్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, సభ్యులు గురాల రఘునాథ్ ఎం. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడుగా యాదగిరి

విశాలాంధ్ర -పలాస: పలాస నియోజకవర్గ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడుగా పలాస మండలం బ్రాహ్మణతర్ల గ్రామానికి చెందిన వడ్డీ యాదగిరి (దాలయ్య) ఎంపికయ్యారు. ఈ కమిటీలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో పాటు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండరీకర్ చైర్మన్ గా ఉంటారని, ఎస్సీ ఎస్టీ సమస్యలను పరిష్కరించేందుకు కమిటీ పని చేస్తుందని యాదగిరి తెలిపారు. అంతే కాకుండా జిల్లా దళిత సాధికారత పార్లమెంట్ సభ్యులుగా, బ్రాహ్మణతర్ల గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేయడం పట్ల పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, టీడిపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, మాజీ మంత్రి గౌతు శివాజీ, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్న చౌదరి, గౌతు శివాజీ తన పై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు అందేలా చూస్తానని చెప్పారు.

వైసిపి అనుబంధ విభాగాల నూతన అధ్యక్షులకు ఘనంగా సన్మానం

విశాలాంధ్ర -నరసన్నపేట: స్థానిక వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ వైసిపి అనుబంధ విభాగాలకు నూతనంగా ఎంపిక చేసిన అధ్యక్షులకు వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్ గురువారం శాలువా కప్పి, ఘనంగా సన్మానం చేశారు. సుమారు 26రంగాలకు పలు కులాలకు చెందిన వైసిపి నాయకులను అధ్యక్షులుగా నియమించటం జరిగింది. ఈ సందర్భంగా ఎంపికైన అధ్యక్షులు, వైసిపి జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్‌కు, పోలాకి జెడ్పీటిసి, నియోజకవర్గ యువ నాయకులు, డా.ధర్మాన కృష్ణచైతన్యకు అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ సర్పంచ్, బుర్లల్లి శంకరరావు, నరసన్నపేట, జలుమూరు ఎంపిపిలు, ఆరంగి మురళీధర్, వాన గోపి, వైసిపి నాయకులు, కరిమి రాజేశ్వరరావు, బగ్గు రామకృష్ణ, ముద్దాడ బైరాగినాయుడు, కనుసు సీతారం, బొబ్బాది ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సొండి కులస్తులకు మద్యం దుకాణం

విశాలాంధ్ర -సోంపేట: సోంపేట మండలంలో సొండి కులస్తులకు ప్రభుత్వం మద్యం దుకాణం కేటాయించినట్లుగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కె.బేబీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఫిబ్రవరి 7వ తారీఖు సాయంకాలం 5 గంటల్లోగా ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని సొండి కులస్తులు మాత్రమే వినియోగించుకోవాలని అన్నారు. పూర్తి వివరాలకు సోంపేటలో ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

చిత్తడి నేలల దినోత్సవం విజయవంతం చేయండి

విశాలాంధ్ర -సోంపేట: ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోంపేటలో నిర్వహించే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు జయప్రదం చేయాలని సోంపేట పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.కృష్ణమూర్తి కోరారు. 2వ తారీఖున సోంపేటలో కళాశీ సంఘ భవనంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో చిత్తడి నేలలపై మరింత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎన్విరాన్‌మెంటల్ జర్నలిస్ట్ జె.వి.రత్నం, బులిశెట్టి సత్య ఈ కార్యక్రమానికి హాజరై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. పర్యావరణ శాస్త్రవేత్తల అంచనాలకు మించి పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు, వాతావరణంలో ఆక్సిజన్ శాతం తగ్గిపోవడం మొదలైన సామాజిక ప్రతికూల పరిస్థితులకు పర్యావరణ సమతుల్యత దెబ్బ తినడమే కారణమని డాక్టర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఇప్పటికైనా సమాజం మేలుకోకపోతే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు.

ఎస్టీ కమిషన్ దృష్టికి గిరిజన సమస్యలు

విశాలాంధ్ర -జలుమూరు: శ్రీకాకుళం జిల్లాలో ఉన్న గిరిజన సమస్యలను ఢిల్లీలో నేషనల్ ఎస్టీ కమిషనర్ మరియు సభ్యులకు కలసి విన్నవించినట్లు శ్రీకాకుళం గిరిజన ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ తెలిపారు. ఢిల్లీ వెళ్లి స్వయంగా ఇక్కడ సమస్యలను తెలియజేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో గల గిరిజన భవనాన్ని గిరిజనులకు అప్పగించాలని, నిధులు దుర్వినియగం దర్యాప్తు చేయాలని ఆయన వినతి పత్రంలో కోరారు. శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటీడీఏ మన్యం జిల్లాలో విలీనం కావడంతో ఇక్కడ ఐటిడిఏ కార్యాలయం లేక గిరిజన ఇబ్బంది పడుతున్నారని, ఐటిడిఏ ఏర్పాటు చేయాలని మెళియాపుట్టి మండల కేంద్రంగా ఐటిడిఏ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. పోడు వ్యవసాయం చేసుకున్న గిరిజన ప్రాంతాల్లో గ్రానైట్ లీజులు రద్దు చేయాలని ఆయన సూచించారు. ఆయనతోపాటు రాష్ట్ర నాయకులు వీఎస్‌అంజనేయులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా ఆశ్రమాన్ని సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు స్థానిక సానావీధి వద్ద గల మదర్ థెరిస్సా ఆశ్రమాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్.సన్యాసి నాయుడు మాట్లాడుతూ నలుగురికి సేవ చేసే సేవాభావం అందరిలోనూ ఉండాలని వృద్ధులు దేశానికి ఎప్పటికీ భారం కాదన్నారు. మార్గదర్శి జాతిపిత అయినటువంటి మహాత్మ గాంధీని స్మరించుకుంటూ అతను చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ మహాత్మ

గాంధీ వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలో గల వృద్ధులకు దుప్పట్లను, పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

విశాలాంధ్ర -టెక్కలి: మండల కేంద్రంలో స్థానిక తెంబూరు రహదారిలోన జిల్లా ఆసుపత్రి సమీపంలో ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణ నిర్మాణాలను గురువారం టెక్కలి రెవెన్యూ, పంచాయతీ అధికారులు తొలగించారు. సర్వే నంబర్ 503/19ఏ లో ప్రభుత్వ స్థలంలో కొందరు నిర్మాణాలు చేపట్టారు. ఈ మేరకు పరిశీలించిన అధికారులు ఆక్రమణ అని తేలడంతో టెక్కలి పోలీసులు సమక్షంలో జేసీబీ సహాయంతో ఆక్రమణలను తొలగించారు.

విద్యార్థుల నైపుణ్యాన్ని పరీక్షించిన ఎంఈఓ

విశాలాంధ్ర -జలుమూరు: సారవకోట మండలం నవతల మాలువ పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి మద్దు వెంకటరమణ గురువారం పర్యవేక్షించారు. అక్కడ విద్యార్థులు నైపుణ్యత ఈ ఏడాది ఆర్థిక విద్య ప్రగతి పలు అంశములపై చర్చించి రికార్డులను పరిశీలించారు. అక్కడ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యతను ప్రశ్నలు వేసి రాబెట్టుకున్నారు. అదేవిధంగా మండలం గోవర్ధనపురం పురుషోత్తపురం పాఠశాలను రెండవ మండల విద్యాశాఖ అధికారిని కే భూలక్ష్మి పరిశీలించారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. వారితో పటు పాఠశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షునిగా 'దండి జయప్రకాష్'

విశాలాంధ్ర -నరసన్నపేట: పట్టణంలో హడ్కోకాలనీకి చెందిన మాజీ వార్డ్ మెంబర్, దండి జయప్రకాష్ వైసిపి నియోజకవర్గ యూత్ వింగ్ విభాగానికి అధ్యక్షునిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం

స్థానిక వైసిపి కార్యాలయంలో జయప్రకాష్‌కు వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్ శాలువా కప్పి, ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూత్ వింగ్ విభాగానికి ఎంపికైన జయప్రకాష్ బాధ్యతలు సక్రమంగా నిర్వహించి, యువతను ఆదర్శంగా ఉండాలన్నారు. అనంతరం దండి జయప్రకాష్ మాట్లాడుతూ నామీద నమ్మకంతో నియోజకవర్గ యూత్ వింగ్‌కు అధ్యక్షునిగా ఎంపిక చేసిన వైసిపి జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్‌కు, పోలాకి జెడ్పీటిసి, నియోజకవర్గ యువ నాయకులు, డా.ధర్మాన కృష్ణచైతన్యకు కృతజ్ఞతలు తెలియచేశారు.

ధర్మాన కృష్ణదాస్‌కు ధన్యవాదాలు తెలిపిన శిష్టకరణ సంఘం

విశాలాంధ్ర -నరసన్నపేట: వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్‌కు నరసన్నపేట శిష్టకరణ సంఘం ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా పోలాకి మండలం మబగాం గ్రామంలోని

కృష్ణదాస్‌కు శిష్టకరణ సంఘం ప్రతినిధులు, సదాశివుని ప్రభాకరరావు, మేజర్ పంచాయితీ వార్డ్ మెంబర్, రఘుపాత్రుని శ్రీధర్(బుజ్జి), యు.జగన్నాధరావు, ఆర్.వై ఖుంట్రావు మర్యాదపూర్వకంగా కలిసి, శాలువ కప్పి, ఘనంగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేధావుల ఫోరం అధ్యక్షునిగా సదాశివుని కృష్ణకు ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దివాలా తీయించిన జగన్

- ఎమ్మెల్యే కూన రవికుమార్

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఐదేళ్లపాటు అధికారాన్ని అడ్డం పెట్టుకొని జగన్మోహన్ రెడ్డి 10 లక్షల కోట్ల రూపాయలను అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించారని స్థానిక శాసనసభ్యులు కూన రవికుమార్ ఆరోపించారు. గురువారం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో జగన్మోహన్ రెడ్డి తన విలాసాల కోసం, వారి కుటుంబం కోసం సుమారు 8 లక్షల కోట్ల రూపాయలు దుబారా చేశారని దుయ్యబట్టారు. సచివాలయాలకు రంగులు, జగన్ బొమ్మలు ఇలా వేలకోట్ల రూపాయలు ప్రజాధనాన్ని లూటీ చేసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాలా తీయించారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ గుండెకాయ లాంటి సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టారని, టి డి ఆర్ బాండ్లు, స్మార్ట్ మీటర్ల పేరిట, రేషన్ బియ్యం ఇలా అన్నింటా స్కాములు చేసి తన అనుయాయులకు దోచి పెట్టేందుకు ప్రభుత్వ ధనాన్ని ద్యూటీ చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏడు నెలల్లో 10 లక్షల కోట్ల రూపాయలు అప్పుకుగాను నెలకు 71 వేల కోట్ల రూపాయలు చంద్రబాబు నాయుడు చెల్లించారని తెలిపారు. అలాగే 1,40,000 వేల కోట్ల రూపాయలు వైసీపీ దుర్వినియోగం చేసిందని దీంతో ఆర్థిక దివాలా దిశగా రాష్ట్రం పయనించిందని వివరించారు. అసలు వడ్డీ నెలకు 71 వేల కోట్ల రూపాయలు చెల్లించడం చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి గుదిబండలా మారిందని అన్నారు. విచ్ఛిన్నమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు వెజినరీ నాయకుడు చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. కోడిగుడ్ల చెక్కిలు ఇలా అన్నింట అక్రమాలకు పాల్పడి రాష్ట్రాన్ని దివాలా తీయించారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడిని పెట్టేందుకు ఓటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

ఇబ్బందులు లేకుండా పనులు చేపడతాం

విశాలాంధ్ర-పలాస: మండలం బ్రాహ్మణతర్ల పెద్ద వీధిలో మంచి నీటి కొళాయి, సిసి రోడ్ల నిర్మాణంకు ఇబ్బందులు లేకుండా పనులు చేపడతామని ఆర్ డబ్ల్యూఎస్ డిఇ సూర్యనారాయణ, పంచాయితీ రాజ్ డిఇ జి రవిబాబు అన్నారు. పలాస మండలం బ్రాహ్మణతర్ల పెద్ద వీధిలో లీక్ అవుతున్న పైపులైన్, నూతనంగా మంజూరు అవుతున్న సిసి రోడ్డు నిర్మాణం కోసం గురువారం కూటమి నాయకులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధిలో పది అడుగుల వెడల్పుతో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టి రోడ్డుకు రెండు వైపులా అడుగు వెడల్పులో ఇంటింటికి కొళాయి ఏర్పాటు కోసం స్థలం విడిచి పెట్టాలని సూచించారు. వీధికి రెండు వైపులా 200 మీటర్లు పొడుగునా త్వరలో ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేస్తామని చెప్పారు. సిసి రోడ్డు, ఇంటింటికి కొళాయి ఏర్పాటు కోసం ఇబ్బంది లేకుండా పనులు చేపడతామని చెప్పారు. అలాగే మండలంలోని ఈదురాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిణం జరుగుతున్న సిసి రోడ్లు పనులను పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లించడం జరగదని పంచాయితీ రాజ్ డిఇ జి రవిబాబు కాంట్రాక్టుకు హెచ్చరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వడ్డీ యాదగిరి, ఆళ్ళ కృష్ణారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దానేటి వెంకటేష్, తామడ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-పలాస: పలాస మున్సిపల్ కార్యాలయంలో, కాశీబుగ్గ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద గురువారం ఘనంగా గాంధీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు మీసాల సురేష్ బాబు, బోర కృష్ణారావు, కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, శార్వాణి గీత, సనపల సింహాచలం బెల్లాల శ్రీనివాసరావు సవర సోమేశ్వరరావు దువ్వాడ శ్రీకాంత్, జోగ త్రివేణి తంగుడు ఆశాలత, జ్యోతి నాయక్ తదితరులు పాల్గొన్నారు. పలాస మండలం బ్రాహ్మణతర్ల గ్రామంలో గాంధీ బజార్ లో ఘనంగా గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పూన కృష్ణ మోహన్, పూన రత్నాకర్, వడ్డీ యాదగిరి ఆళ్ళ కృష్ణారావు బమ్మిడి ఆనందరావు ఆళ్ళ వెంకటరావు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. పలాస మండలం బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో గురువారం గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ

విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ రమణ రావు, ఉపాధ్యాయులు బమ్మిడి కిషోర్ కుమార్, ఇ ఈశ్వరరావు, కె శ్రీనివాసరావు, దువ్వాడ జనార్ధనరావు, డి శివ ప్రసాద్, సుధా కుమారి, ఎం అరుణ కుమారి, ఎస్ కృష్ణవేణి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెయిన్ కిల్లర్స్‌ను అధికంగా వాడొద్దు

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి బాల మురళీకృష్ణ

విశాలాంధ్ర -జలుమూరు: ప్రజలు అవసరాలకు అనుకూలంగా మందులు వినియోగించాలే తప్ప నొప్పులు ఉన్న సమయాల్లో అధిక మోతాదులో పెయిన్ కిల్లర్స్ ఇంజక్షన్లు టాబ్లెట్స్ వినియోగించరాదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి టి బాల మురళీకృష్ణ అన్నారు. గురువారం సారవకోట మండలం పెద్దలంబ గ్రామంలో పెయిన్ కిల్లర్స్ కిడ్నీ వ్యాధులుపై ప్రభావం చూపుతుందని తెలుసుకున్న ఆయన గ్రామాన్ని సందర్శించి ఉన్న రోగులకు పలు సూచనలు అందించి ప్రజల యొక్క ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నీటి వలన ఇబ్బందులు లేవని మనం నొప్పుల మందులు తగ్గిస్తేనే ఈ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని ఆయన సూచించారు. ఆయనతోపాటు బొంతు వైద్య అధికారినిలు సుస్మిత సుధారాణి, స్థానిక సర్పంచ్ యిసై షణ్ముఖరావు, స్థానిక పెద్దలు, ప్రజలు, ఆరోగ్య కార్యకర్త ఇతరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహాత్మా గాంధీ వర్ధంతి

విశాలాంధ్ర -పొందూరు: జాతి పితా మహాత్మా గాంధీ జీ 78వ వర్ధంతిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ ఉదయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. స్వతంత్ర భారత్ కి స్వరాజ్య భారత్ కి ఆశాజ్యోతి జాతిపిత మహాత్మా గాంధీజీ శాంతియుత పోరాటాలు అజేయమని ప్రిన్సిపాల్ అన్నారు. అహింసా మార్గంలో అడుగుల వేసి తెల్లదొరల గుండెల్లో దడ పుట్టించిన గాంధీజీ ఆశయాల సాధన కోసం అహింస మార్గంలో నడవాలన్నారు. అహింసా వాదిగా ప్రపంచానికి ఒక దిక్సూచిగా నిలిచిన ఘనత మన శాంతి దూత గాంధీజీ కే దక్కిందన్నారు. నేటి తరం యువత గాంధీజీ మార్గాన్ని అనుచరించాలని పిలుపునిచ్చారు. గాంధీజీకి ప్రీతికరమైన ఖాదీ,చేనేత పరిశ్రమలైన సాయిబాబా వివర్స్ సొసైటీ మేనేజర్ వట్టం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి జరుపగా, ఏఐఎఫ్ కేకే సంఘం అధ్యక్షులు గుంటుకు కామేశ్వర ప్రసాద్, కార్యదర్శి దండా వెంకటరమణలు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో

మన్మధరావు, మండల విద్యాశాఖ అధికారి వారి కార్యాలయంలో ఎం ఈ ఓ జి. రాములు ,పట్నాన రాజారావులు స్థానిక మేజర్ పంచాయతీలో ఇ వో మోహన్ బాబులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వర్ధంతి జరుపుకున్నారు.

చల్లవానిపేటలో మహాత్మా గాంధీ 77వ వర్ధంతి

- పాల్గొన్న నరసన్నపేట కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మామిడి

విశాలాంధ్ర-జలుమూరు: మండలం చల్లవానిపేట పిఎసిఎస్ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి ఆయన 77వ వర్ధంతి సందర్భంగా నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మామిడి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ మార్గం అందరికీ అనుసరణీయమని ఆచరణీయమన్నారు. ప్రపంచ దేశాలు గాంధీజీ బోధనలు ఆచరిస్తుంటే మన రాష్ట్రం దేశంలో మాత్రం గాంధీజీ మార్గాన్ని విస్మరిస్తున్నారని ఎంత వరకు సమంజసమని ఆయన అన్నారు. ప్రభుత్వాలు గుర్తించి ఎప్పటికైనా గ్రామ స్వరాజ్యం కు బాటలు వేసి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు విద్య, వైద్య అందుబాటులోకి తెచ్చి గ్రామ అభివృద్ధికి బాటలు వేయాలని మామిడి సత్యనారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బరి వెంకటరమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్ జైల్‌ను సందర్శించిన జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక సబ్ జైల్‌ను గురువారం జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్, చందక హరిప్రియ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ముద్దాయిల బాగోగుల గూర్చి అడిగి తెలుసుకున్నారు. అలాగే జైల్‌లో ముద్దాయిలకు మౌళిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ న్యాయవాదులను పెట్టుకోలేని ముద్దాయిలు ఉంటే వారు జిల్లా న్యాయాధికార సేవా సంస్థ సేవలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపరెండెంట్, వినయ్‌కుమార్‌తో పాటు జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు పాల్గొన్నారు.